# బీమ్ ఫైబర్ ఇకపై
# యాక్ట్ ఫైబర్



- వచ్చే ఏడాది నాటికి లక్ష నెట్ కనెక్షన్లు
- ఇప్పటికే రూ. 500 కోట్ల టర్నోవర్ సాధించాం
- యాక్ట్ గ్రూపు సీఈవో బాల మల్లాది

మన తెలంగాణ / హైదరాబాద్

ఆప్టికల్ ఫైబర్ ఆధారిత ఇంటర్‌నెట్ టెక్నాలజీలో హైదరాబాద్‌లో అగ్రగామిగా ఉన్న బీమ్ ఫైబర్ ఇకపై యాక్ట్ ఫైబర్ నెట్ కానుంది. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో యాక్ట్ గ్రూప్ సీఈవో బాల మల్లాది పలు విషయాలను వెల్లడించారు. బీమ్ ఫైబర్, యాక్ట్ ఫైబర్ నెట్‌గా పరివర్తన చెందడం కంపెనీకి జాతీయ బ్రాండ్‌గా తీర్చిదిద్దడంలో మలుపురాయిగా భావిస్తున్నామన్నారు. ఇప్పటికే భారతదేశంలో ఇంటర్‌నెట్ వినియోగాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో యాక్ట్ అగ్రస్థానంలో ఉందన్నారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 6.5 లక్షల ఇంటర్‌నెట్ కనెక్షన్లు కల్గి ఉన్నామని, వచ్చే ఏడాది కొత్తగా మరో లక్ష కొత్త కనెక్షన్లు పొందాలన్నది తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. 2013 సంవత్సరంలో కంపెనీ రూ. 500 కోట్ల టర్నోవర్‌ను సాధించిందన్నారు. మార్కెట్‌ను పెంచడం లోనే గాకుండా ఆన్‌లైన్ యూజర్ ప్రవర్తనలో మార్పు తీసుకు రావడంలో యాక్ట్ కీలకంగా పని చేస్తోందన్నారు. భారతదేశంలో ఇంటర్‌నెట్ వినియోగంలో హైదరాబాద్ కూడా చాలా ప్రముఖ మైందని, ఈ నేపథ్యంలో తమ కార్యకలాపాలు ఇక్కడా భవిష్యత్తులో మరింత విస్తరిస్తామని ఆయన వెల్లడించారు. నాల్గు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నమార్కెట్లో యాక్ట్ తన నూతన బ్రాండ్ ఆవిష్కారం సందర్భంగా ఈ ప్రకటన చేస్తుండడం వెనుక ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. మీడియా సమావేశంలో యాక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ సుందర్ రాజు, ప్రమోద్ కల్రా తదితరులు పాల్గొన్నారు.